నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, శుక్రవారం 16 మే 2025 | KHAMMAM

కలెక్టర్ ఎదుట గూడు గోడు..

- అనర్హులకు ఎలా ఇచ్చారని ఫిర్యాదు
- అన్ని అర్హతలున్న తనకు ఇల్లు మంజూరు చేయాలని కోరిన మహిళ

చండ్రుగొండ, మే 15 : అన్ని అర్హతలున్నా తనకు ఇందిరమ్మ ఇల్లు రాకుండా చేశారని, నిరుపేదనైన తనకు ఇల్లు ఇప్పించాలని ఓ మహిళ కలెక్టర్ జితేశ్ వి పాటిల్‌కు గురువారం తన గోడు విన్నవించుకుంది. చండ్రుగొండ మండలం రావికంపాడు గ్రామానికి వెళ్లిన కలెక్టర్‌కు.. అదే గ్రామానికి చెందిన నిరుపేద మహిళ మద్దిరాజు కళమ్మ తాను దరఖాస్తు చేసుకున్నా ఇందిరమ్మ ఇల్లు రాలేదని, మా గ్రామంలో అర్హులకు కాకుండా అనర్హులకు ఇండ్లు మంజూరు చేశారని వాపోయింది. అన్ని అర్హతలున్నా తనకు ఇల్లు మంజూరు చేయలేదని, వ్యవసాయ భూములు, భవనాలు ఉన్న వారికి ఇండ్లు ఎలా మంజూరు చేశారో అర్థం కావడం లేదన్నారు. ఈ క్రమంలో ఆమెకు సర్ది చెప్పేందుకు అక్కడకు వచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కలెక్టర్.. ఆమెను సముదాయించి, రెండో జాబితాలో అర్హులైన వారికి ఇండ్లు వచ్చేలా చూస్తామని చెప్పారు.

చండ్రుగొండ మండలం రావికంపాడులో కలెక్టర్ ఎదుట ఇందిరమ్మ ఇంటి కోసం గోడు వెళ్లబోసుకుంటున్న నిరుపేద మహిళ

నిబంధనల సాకుతో.. నిరుపేదలకు శరగోపం?

ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాకుండా సర్కారు కొర్రీలు

అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని, అనర్హులకు ఇచ్చిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని, అనర్హులకు మంజూరైన ఇండ్లను రద్దు చేస్తామని ప్రతీ సభలో పదే పదే మంత్రులు చెబుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో మాత్రం అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతున్నాయి. 'అసలైన పేదలకు ఇండ్లు మంజూరు కాకుండా శరగోపం పెట్టేందుకు ప్రభుత్వమే వివిధ నిబంధనలను సాకుగా చూపుతోందా?' అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో సర్కారు పెడుతున్న కొర్రీలను చూస్తుంటే ఆ అనుమానాలకు బలం చేకూరుతోంది. దీంతో రేవంత్ సర్కారు తీరుపై నిరుపేదల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. అటు ప్రభుత్వం ఆదేశాలు, ఇటు అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్ల వంటి కారణాలతో సంబంధిత అధికారులు కూడా నిస్సహాయ స్థితిలో ఉండిపోతున్నారు.

-అశ్వారావుపేట, మే 15

- పథకం అమలులో అడుగడుగునా అడ్డంకులు
- నిబంధనల పేరిట పేదలకు దూరం చేసే యత్నం?
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై అసంతృప్తిలో పేదలు
- నిస్సహాయ స్థితిలో సంబంధిత అధికారులు

అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయి పూరి గుడిసెలో నివాసం ఉంటున్న మరియమ్మ

అమలు సాధ్యంగాని హామీలిచ్చి అధికారంలోకొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. నిబంధనల పేరుతో కొర్రీలు పెడుతూ నిరుపేదలకు సంక్షేమ పథకాలను దూరం చేస్తోంది. ఇందులో ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్ల పథకమే కన్పిస్తోంది. అర్హుల ఎంపిక బాధ్యతను ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీలకు అప్పగించడమే ఇందులో ప్రధానాంశం. కాంగ్రెస్ కార్యకర్తలనే అర్హులుగా చూపుతూ ఇందిరమ్మ కమిటీల బాధ్యులు జాబితాలను రూపొందిస్తుండడంతో అర్హుల ఎంపికలో అధికారుల పాత్ర శూన్యమైంది.

మూడు నెలలుగా సాగదీతలు..

ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించి మూడు నెలలు గడుస్తున్నా ఇంకా సాగదీతలే కన్పిస్తున్నాయి. సొంతింటి కల నెరవేరుతుందనుకొని ఆశగా ఎదురుచూస్తున్న నిరుపేదలకు ఇంకా నిరాశే మిగులుతోంది. మండలానికి ఒక పైలట్ గ్రామాన్ని ఎంపిక చేసి ఈ ఏడాది జనవరి 26న ఈ పథకాన్ని ప్రారంభించిన ప్రభుత్వం.. తరువాత మిగిలిన గ్రామాలకూ విస్తరిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ఎంపికైన వారి జాబితాతో అధికారులు కూడా క్షేత్రస్థాయిలో సర్వే చేపడుతున్నారు. కానీ.. జాబితా నిండా అనర్హుల పేర్లు, కాంగ్రెస్ కార్యకర్తల పేర్లే ఉండడంతో నిరుపేదలు నిలదీయడం మొదలుపెట్టారు. దీంతో సర్వే కూడా సక్రమంగా కొనసాగడం లేదు. తమకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాలేదంటూ ఇప్పటికీ అన్ని గ్రామాల్లోనూ పేదలందరూ ఆందోళనలో చేస్తున్నారు.

మార్గదర్శకాలివీ..

ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కోసం ప్రభుత్వం పలు మార్గదర్శకాలను ప్రకటించింది. వీటిని చూసి పేదలు ఆశ్చర్యానికి గురవుతున్నారు. పేదలకు ఇండ్లు మంజూరు కాకుండా ఉండేందుకు ప్రభుత్వమే ఇలాంటి కొర్రీలుగా పెట్టినట్లుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నిబంధనలను పరిశీలిస్తే..

- ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు దారిద్ర్య రేఖకు దిగువన ఉండాలి. గ్రామాల్లో నివసిస్తూ స్థానికులై ఉండాలి. నెల ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో అయితే రూ.10 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.15 వేలలోపు ఉండాలి.
- రెండున్నర ఎకరాలకంటే ఎక్కువ భూమి ఉన్న రైతులూ అనర్హులే.
- నాలుగు చక్రాల వాహనం, ట్రాక్టర్ ఉన్న రైతులకు అర్హత ఉండదు.
- లబ్ధిదారుల కుటుంబంలో పంట రుణం రూ.50 వేలకు మించి ఉండకూడదు.
- లబ్ధిదారుల ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగి ఉంటే అర్హులు కాదు.
- సంచార కుటుంబాలకు ఇల్లు మంజూరు చేయకూడదు.
- స్థలం ఉండి పక్కా ఇల్లులేని (తాటాకు ఇల్లు, రేకుల షెడ్డు, పెంకుటింట్లో నివసించే) పేదలే అర్హులు.
- కుటుంబంలో ఎంతమంది అర్హులున్నా ఒక్కరికే ఇందిరమ్మ ఇల్లు.
- మున్సిపాలిటీ ప్రాంతంలో అద్దె ఇంట్లో ఉండే వారు అర్హులే.
- పట్టణ ప్రాంతాల్లో ఇంటి స్థలం, పట్టా సర్టిఫికెట్ ఉండాలి.
- లబ్ధిదారుడికి 60 గజాల ఇంటి స్థలం ఉండాలి.
- స్థలానికి పట్టా, ఓనర్‌షిప్ సర్టిఫికెట్ లేకుండా ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాదు.
- ఇందిరమ్మ ఇంటి నిర్మాణం 400 నుంచి 600 చదరపు అడుగుల్లోనే ఉండాలి. అంతకు మించి నిర్మాణం చేస్తే ఇల్లు రద్దు అవుతుంది.
- ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో రెండు గదులు, కిచెన్, మరుగుదొడ్డి కచ్చితంగా ఉండాలి.
- ఇంతకుముందే నిర్మాణం ప్రారంభించినా, పాత ఇంటికి కలిపి నిర్మించినా ఇందిరమ్మ ఇంటికి అనర్హులే.

ఇల్లు కాలిపోయినా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయలేదు..

అగ్ని ప్రమాదంలో మా ఇల్లు పూర్తిగా కాలిపోయింది. అప్పటి నుంచి పూరి గుడిసె నిర్మించుకొని జీవిస్తున్నాం. అయినా మాకు ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయలేదు. మా సమస్యను ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి చెప్పుకునే అవకాశం కూడా ఇవ్వలేదు.

-కలపాల మరియమ్మ, గుర్రాలచెరువు, అశ్వారావుపేట

ప్రభుత్వ నిబంధనల మేరకు మంజూరు..

ప్రభుత్వ నిబంధనల మేరకే అర్హులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు జరుగుతోంది. ఇందిరమ్మ గ్రామ కమిటీలు ఎంపిక చేసిన వారిలో అనర్హులుంటే విచారణ చేసి తొలగిస్తున్నాం. తర్వాత ఎల్-2 జాబితాలోని అర్హులను తుది జాబితాలో చేర్చుతున్నాం.

-ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో, అశ్వారావుపేట

అందాల భామల కాళ్లను ఆడబిడ్డలతో కడిగించడమేంటి?

- తక్షణమే సీఎం క్షమాపణ చెప్పాలి.. మంత్రులు రాజీనామా చేయాలి
- విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి

కొత్తగూడెం అర్బన్, మే 15: రాణి రుద్రమదేవి, చాకలి ఐలమ్మ వారసులుగా సమ్మక్క, సారలమ్మల పౌరుషాన్ని పుణికి పుచ్చుకున్న తెలంగాణ గడ్డపై.. ఇక్కడి ఆడబిడ్డలతో అందాల భామల కాళ్లు కడిగించడమేంటని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆ దృశ్యాలను చూసి యావత్ సమాజం నివ్వెరపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై తక్షణమే సీఎం క్షమాపణ చెప్పాలని, మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, కొండా సురేఖ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. భద్రాద్రి జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసలు ఈ అందాల పోటీలతో రాష్ట్రానికి ఒరిగేదేముందని ప్రశ్నించారు. 'ఈ పోటీల నిర్వహణ వల్ల వరంగల్, హైదరాబాద్ నగరాల ఖ్యాతి ఇసుమంతైనా పెరుగుతుందా?' అంటూ నిలదీశారు. సీఎం రేవంత్‌రెడ్డి తీసుకుంటున్న తుగ్లక్ నిర్ణయాల వల్ల దేశంలో తెలంగాణ పేరు అధఃపాతాళానికి పడిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. 'రూ.200 కోట్లు ఖర్చు పెట్టి నిర్వహిస్తున్న ఈ అందాల పోటీల వల్ల తెలంగాణలోని నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయా? ఉపాధి అవకాశాలేమైనా పెరుగుతాయా?' అని ప్రశ్నించారు. అందాల భామలు వరంగల్ వస్తున్నారని మోరీలు కనపడకుండా పరదాలు కట్టారని, రోడ్ల వెంట ఉన్న చిరు వ్యాపారుల దుకాణాలను తొలగించారని అన్నారు. ఇది ఎంత వరకూ సమంజసమో ప్రభుత్వమే చెప్పాలని డిమాండ్ చేశారు. వరంగల్‌కు వచ్చిన అందాల భామల కాళ్లను తెలంగాణ ఆడబిడ్డలతో కడిగించడాన్ని తెలంగాణ సమాజం వ్యతిరేకిస్తోందని అన్నారు. కాంగ్రెస్‌లో బానిసత్వపు ఆనవాళ్లు ఇంకా పోలేదని విమర్శించారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు బాదావత్ శాంతి, తొంగరు రాజశేఖర్, వేముల ప్రసాద్‌బాబు, పల్లపు రాజు, సింధు తపస్వి, రామిళ్ల మధుబాబు, ఖాజా భక్షి, సతీశ్, మునీర్, పురుషోత్తం, పూర్ణచందర్, జయరాం తదితరులు పాల్గొన్నారు.

నీటి కుంటలతోనే భూగర్భ జలాల పెంపు

కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ లక్ష్మీనారాయణమ్మ

మాట్లాడుతున్న లక్ష్మీనారాయణమ్మ

కొత్తగూడెం టౌన్, మే 15 : వర్షపు నీటిని ఒడిసిట్టేందుకు, భూగర్భ జలాలు పెంపొందించేందుకు రైతులందరూ తమ తమ పంట భూముల్లో నీటి కుంటలు నిర్మించుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) కొత్తగూడెం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ వి.లక్ష్మీనారాయణమ్మ సూచించారు. కేవీకే శాస్త్రవేత్తల బృందం.. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమాన్ని సుజాతనగర్ మండలం సర్వారం గ్రామంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ప్రతీ వర్షాకాలంలో తగినంత స్థాయిలో వర్షపాతం నమోదవుతున్నదని, ఈ క్రమంలో ఆ నీటిని వృథాగా పోనివ్వకుండా నీటి కుంటలు నిర్మించుకొని భూగర్భ జలాలు పెంపొందించుకోవాలన్నారు. సాగు సీజన్‌లో పంటలకు నీటి కొరత ఏర్పడినప్పుడు ఈ నీటిని వినియోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాస్త్రవేత్తలు శివ, స్రవంతి, విస్తరణాధికారి ప్రనూష, 62 మంది రైతులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగు లక్ష్యాలను చేరుకోవాలి

- 8 నెలల్లో సాగు విస్తరణను దాదాపు రెండింతలు చేయగలిగాం
- ఆయిల్‌పాం సాగు, వ్యవసాయ శాఖ సమీక్షలో ఖమ్మం కలెక్టర్

ఆయిల్‌ఫాం సాగుపై ఉద్యానవన శాఖ ముద్రించిన బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఖమ్మం కలెక్టర్

రఘునాథపాలెం, మే 15: ఆయిల్‌పాం సాగు లక్ష్యాలను ప్రణాళికాబద్ధంగా చేరుకోవాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. ఆయిల్‌పాం సాగు, వ్యవసాయ శాఖల పనితీరుపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. గడిచిన 8 నెలల కాలంలో ఖమ్మం జిల్లాలో ఆయిల్‌పాం సాగు విస్తరణను దాదాపు రెండింతలు చేసుకోగలిగామని, ఇందుకు కృషిచేసిన అధికారులందరూ అభినందనీయులని అన్నారు. ఆయిల్‌పాం సాగుకు అనుకూలంగా డీడీలు తీసిన రైతులు వచ్చే వానకాలం ఇతర పంటలు వేయకుండా జగ్రత్త వహించాలని సూచించారు. డీడీలు తీసిన రైతుల పొలాల్లో వానకాలం నుంచి ఆయిల్‌పాం మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యవసాయ విస్తరణ, హార్టికల్చర్ అధికారులు పొలాల దగ్గరకు వెళ్లి ఆయిల్‌పాం సాగుచేస్తున్న రైతులతో మాట్లాడాలన్నారు. ఏఈవోలు తన క్లస్టర్ పరిధిలో కనీసం 10 ఎకరాల్లో అయినా ఆయిల్‌పాం విస్తరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని పంటల కొనుగోలు కేంద్రాల వద్ద ఆయిల్‌పాం ఫ్లెక్సీలు, వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో డిజిటల్ బోర్డులు ఏర్పాటుచేసి ఆయిల్‌పాం సాగు లాభాలను వివరించాలని సూచించారు. వరి, మక్క, పత్తి, మిర్చి పంటల సాగు వల్ల వచ్చే ఆదాయానికి, ఆయిల్‌పాం పంట వల్ల వచ్చే ఆదాయానికి ఉన్న వ్యత్యాసాన్ని వివరిస్తూ కరపత్రాలు ముద్రించాలని సూచించారు. అలాగే, నకిలీ విత్తనాలు విక్రయించే వారి పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆయిల్‌పాం సాగుపై ఉద్యానశాఖ ముద్రించిన బ్రోచర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఆయా శాఖల అధికారులు ఎంవీ మధుసూదన్, పుల్లయ్య, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలి

టెలీకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ జితేశ్ వి పాటిల్

మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, మే 15 (నమస్తే తెలంగాణ) : భూభారతి చట్టం కింద ఆన్‌లైన్‌లో రైతుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న భూ భారతి దరఖాస్తులు, రేషన్ కార్డులు, ధాన్యం కొనుగోలు ప్రక్రియ, పెండింగ్ ఎలక్షన్ దరఖాస్తులపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో గురువారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా భూభారతి దరఖాస్తులు 1,679 వరకు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. గ్రామ, మండల, జిల్లాస్థాయిలో వాటి వివరాలను నివేదిక రూపంలో సమర్పించాలని, ఏ స్థాయిలో ఎన్ని రోజులు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయనే వివరాలు తెలియపర్చాలని ఆదేశించారు. రెవెన్యూ అధికారులు పారదర్శకంగా క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాత ప్రభుత్వ మార్గదర్శకాలను తూచ తప్పకుండా పాటిస్తూ నూతన ఆర్‌వోఆర్ చట్టంలో పొందుపర్చిన నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించాలన్నారు. కొత్త రేషన్ కార్డులు, అదనపు కుటుంబ సభ్యుల పేర్లను జతపర్చడం, చనిపోయిన వారి పేర్లను తొలగించడం వంటి అంశాలపై దృష్టి సారించాలన్నారు. అలాగే ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. కేంద్రాల్లో గన్నీ బ్యాగులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం తరలించడానికి ఎన్ని లారీలు అవసరమవుతాయో అంచనా వేసుకొని లోడింగ్ చేసేందుకు సరిపడా హమాలీలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఎన్నికల దరఖాస్తు ఫారం 6,7,8లను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ధాన్యం తరలించలేని దైన్యం

- వరుస వర్షాలు, గాలిదుమారాలతో గడగడలాడుతున్న రైతాంగం
- మిల్లులకు ధాన్యం తరలింపునకు లారీలను సమకూర్చలేని ప్రభుత్వం
- లారీలు పంపలేనంటూ తిరుమలాయపాలెంలో చేతులెత్తేసిన కాంట్రాక్టర్
- రైతులు ఆందోళనలు చేస్తుండడంతో ఉపశమన చర్యల్లో యంత్రాంగం
- ఏకంగా జాతీయ రహదారిపై ఖాళీగా వెళ్తున్న లారీలను ఆపుతున్న వైనం
- కర్షకుల కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఇంకా 60 శాతానికి పైగా ధాన్యం

తిరుమలాయపాలెం, మే 15 : తిరుమలాయపాలెం మండలంలోని ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతల కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. వరి ధాన్యాన్ని కాంటాలు వేసి మిల్లులకు తరలించే అంశంలో జాప్యం జరుగుతూనే ఉంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటికీ ధాన్యపు రాసులు గుట్టలు గుట్టలుగా దర్శనమిస్తున్నాయి. ధాన్యం తరలింపు కోసం లారీలను పంపేందుకు ప్రభుత్వం నుంచి కాంట్రాక్టు పొందిన కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. ఈ నేపథ్యంలో రైతులు ఆందోళనలకు దిగుతుండడంతో అధికారులు ఉపశమన చర్యలు చేపట్టారు. తిరుమలాయపాలెం పోలీసులు, మండల రెవెన్యూ అధికారులు కలిసి ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారిపై తనిఖీలు నిర్వహించి ఖాళీగా వెళ్తున్న లారీలను గుర్తిస్తున్నారు. ఆ లారీలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు పంపించి ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నారు. తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల్లో ధాన్యం రవాణాకు లారీలను సమకూర్చేలా ప్రభుత్వం ఓ కాంట్రాక్టర్‌కు టెండరు పద్ధతిపై కాంట్రాక్టును అప్పగించింది. అతడు లారీలను కేంద్రాలకు పంపించడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నాడు. దీంతో పోలీసులు, అధికారులే రంగంలోకి దిగారు. మండలంలోని ఐకేపీ ఆధ్వర్యంలో తిరుమలాయపాలెం, దమ్మాయిగూడెం, మేడిదపల్లి, బీరోలు, పాతర్లపాడు, హైదర్‌సాయిపేట, బచ్చోడు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే, ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం తరలింపులో ఎక్కువగా జాప్యం జరుగుతోంది. ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు ఈ కేంద్రాల్లో పరిస్థితిని పరిశీలించి సమస్యను పరిష్కరించడంలో తగిన శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే, ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం తరలింపులో రాజకీయాలు కూడా చోటుచేసుకుంటున్నాయని రైతు కూలీ సంఘం నేతలు తిమ్మిడి హనుమంతరావు, గొర్రెపాటి రమేశ్ ఆరోపిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన రైతుల ధాన్యాన్ని ముందుగా తరలిస్తున్నట్లు చెబుతున్నారు. బీరోలు, తిరుమలాయపాలెం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తరలింపు కొంత పర్వాలేదన్నట్టుగా రైతులు చెబుతున్నారు. మండలంలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ఇంకా 60 లోడ్లకుపైగానే ధాన్యం రాసులు మిల్లులకు తరలించేందుకు సిద్ధంగా ఉన్నట్లు రైతులు తెలిపారు. అయితే, వర్షాలు, గాలిదుమారాల నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే ధాన్యాన్ని తరలించకపోవడంపై అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

పిండిప్రోలు సమీపంలో వరంగల్-ఖమ్మం ప్రధాన రహదారిపై ఖాళీగా వెళ్తున్న లారీలను గుర్తించేందుకు తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు

ఆసుపత్రిలో అత్యుత్తమ వైద్య సేవలు

సింగరేణి దవాఖాన తనిఖీలో సీఎండీ బలరాం

రోగులతో మాట్లాడుతున్న సింగరేణి సీఎండీ బలరాం

కొత్తగూడెం సింగరేణి, మే 15 : సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యం, సంక్షేమానికి సంస్థ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు ఖర్చుకు వెనుకాడకుండా సింగరేణి ప్రధానాస్పత్రి సహా అన్ని ఏరియా దవాఖానలను ఆధునీకరించినట్లు సీఎండీ బలరాంనాయక్ తెలిపారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన ఆస్పత్రిని సీఎండీ గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అత్యవసర వార్డుతోపాటు అన్ని వార్డులు, ఉద్యోగులకు వైద్య సేవలు అందించే అన్ని విభాగాలు, ఫార్మసీని ఆయన పరిశీలించారు. మందుల వివరాలను ఫార్మాసిస్టులను, వార్డుల్లోని రోగుల వివరాలను డాక్టర్లు, నర్సులను అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ఆసుపత్రుల్లో త్వరితగతిన కోలుకునే విధంగా వైద్యపరంగా అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. అంతర్గత మెడికల్ ఆఫీసర్స్ ఇటీవల స్టడీ లీవ్‌పై వెళ్లి స్పెషలిస్టు కోర్సు పూర్తి చేసుకొని వచ్చారని, ఇక అన్ని స్పెషలిస్టు వైద్యులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఆయన వెంట సీఎంవో కిరణ్‌రాజ్‌కుమార్, ఏసీఎంవోలు ఉష, సునీలా, సీనియర్ పీవో శ్రీనివాస్, స్పెషలిస్టు వైద్యులు ఉన్నారు.